క్లుప్తంగా

పేపర్ ఏజెంట్ కుటుంబానికి ఆర్థిక సాయం



సన్యాసిరావు కుటుంబానికి నగదును అందిస్తున్న విలేకరులు

కె.కోటపాడు : కె.కోటపాడు గ్రామానికి చెందిన పేపర్ ఏజెంట్ గండిబోయిన సన్యాసిరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. గత 25 ఏళ్లు సన్యాసిరావు పేపర్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. పేదరికంలో ఉన్న ఆయన కుటుంబానికి కె.కోటపాడు మండలానికి చెందిన విలేకరులు శనివారం నగదు సాయం అందించారు.

చురుగ్గా కల్యాణ మండపం పనులు



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ రామధర్మజ

మాడుగుల : స్థానిక మోదమాంబ కాలనీలో కల్యాణ మండపం పనులు చురుగ్గా సాగుతున్నాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు చొరవతో, అనకాపల్లి ఎంపీ సత్యవతి రూ.35 లక్షలు మంజూరు చేశారు. దీంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శనివారం ఎంపీపీ వేమవరపు రామధర్మజ పనుల తీరును పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీలు పాలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, వార్డు మెంబర్లు జవ్వాది వరహాలు, వేమన గణేష్, ఎడ్ల హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు లస్సీ



ఉపాధి కూలీలకు లస్సీ ప్యాకెట్లు అందిస్తున్న సర్పంచ్ రాంబాయి

మాడుగుల : మండలంలో కింతలి వల్లాపురం సమీపంలో గంగునాయుడు చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి తన సొంత నిధులతో శనివారం లస్సీ ప్యాకెట్లు అందించి, మానవత్వాన్ని చాటుకున్నారు. సుమారు 200 మంది ఉపాధి కూలీలకు లస్సీ ప్యాకెట్లు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోవింద్, పీఏసీఎస్ అధ్యక్షుడు సోమన్నదొర, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపురెడ్డి రాంబాబు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చమ్మచింతలో ఉచిత కంటి వైద్య శిబిరం



చమ్మచింతలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నాతవరం : మండలంలోని చమ్మచింత గ్రామంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 89 మంది రోగులను పరీక్షించి మందులు అందించారు. 26 మందికి కంటి అపరేషన్లు అవసరమని వైద్యుడు మణికృష్ణ నిర్ధారించారు. కంటి చూపు పరిరక్షణపై వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సేవా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నానాజీ, రాజుతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వివాదాల్లేకుండా సరిహద్దు రాళ్ల ఏర్పాటు

మాకవరపాలెం : సమగ్ర భూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటు పనులను నర్సీపట్నం ఆర్డీవో జయరాం శనివారం పరిశీలించారు. మండలంలోని జంగాపల్లిలో జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో రీ సర్వే పూర్తి కావడంతో సరిహద్దు రాళ్లు వేసే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో పరిశీలించి, వివాదాలకు తావులేకుండా త్వరితగతిన ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణ, దాతృత్వం.. రంజాన్



కె.జె.పురం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



మాకవరపాలెంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



రోలుగుంట మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

మాడుగుల రూరల్ : మండలంలోని కె.జె.పురం మసీదులో శనివారం రంజాన్ పండగ ఘనంగా నిర్వహించారు. నెల రోజులుగా ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లిం సోదరులు శుక్రవారం సాయంత్రం నెలవంక దర్శనంతో, శనివారం ఈదుల్‌ఫితర్(రంజాన్) పండగ చేసుకున్నారు. ఈ సందర్భంగా మత గురువు షాకీమ్ మస్తాన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఖురాన్ సందేశాలను భక్తిశ్రద్ధలతో ఆలకించి, అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. పండగలో భాగంగా మసీదు అధ్యక్షుడు షేక్ సూరిబాబు, ప్రధాన కార్యదర్శి, చీడికాడ మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ తదితరులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అల్లా దయ కలిగి, ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో అబ్దుల్, మస్తాన్, ఖాదర్‌తోపాటు చీడికాడ, మాడుగుల మండలాలకు చెందిన ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాకవరపాలెం : రంజాన్ వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న ముస్లిం సోదరులంతా మండల కేంద్రంలో ఉన్న మసీదుకు శనివారం ఉదయాన్నే చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రంజాన్ విశిష్టతను మత పెద్దలు వివరించారు. నమాజ్ అనంతరం పేద ముస్లింలకు ఆర్థిక సాయం అందించారు. అంతా కలిసి ఇఫ్తార్ విందు చేసుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోలుగుంట : మండలం కేంద్రం రోలుగుంట ఆల్ తిరుదోస్ మసీదులో ముస్లిం సోదరులు శనివారం రంజాన్ పండగను వేడుకగా చేసుకున్నారు. నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉపవాసం ఉంటూ, ప్రార్థనలు చేశారు. శనివారం కుటుంబ సమేతంగా మసీదుకు వచ్చారు. మత గురువు ఖురాన్ విశిష్టతను వివరించారు. ప్రార్థన చేయించారు. కొవ్వూరు, కె.నాయుడుపాలెం, రోలుగుంట నుంచి ముస్లిం సోదరులు సుమారు 250 మంది రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం వారి ఇళ్ల వద్ద బంధుమిత్రులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. చిన్నారులు, పెద్దలు ఈద్ ముబారక్ అంటూ ఆలింగనం ద్వారా పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

నర్సీపట్నం : పట్టణంలోని ప్రధాన జామియా మసీద్‌లో రంజాన్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ముస్లిం సోదరులు ఉదయాన్నే మసీద్‌కు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సామరస్యం, ఆనందం పెంపొందించాలని అల్లాను ప్రార్థించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

దేవరాపల్లి : పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కాశీపురం మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్ద ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు రంజాన్ ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చిన్నారులు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పేదలకు దానం చేశారు. ఈ వేడుకల్లో కాశీపురం, దేవరాపల్లి, ఎ.కొత్తపల్లి, చిననందిపల్లి, నాగయ్యపేట తదితర గ్రామాలకు చెందిన ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆలింగనం చేసుకుంటున్న చిన్నారులు



రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు



కాశీపురం మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చిట్టిగెడ్డ వంతెనకు శ్రీకారం

- రూ.2.40 కోట్లతో నిర్మాణ పనులకు భూమిపూజ
- డిప్యూటీ సీఎం చొరవతో పదేళ్ల నిరీక్షణకు తెర



వంతెన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు : మల్లంపాలెం-చౌడువాడ గ్రామాల మధ్యనున్న చిట్టిగెడ్డపై నూతన వంతెన నిర్మాణానికి అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంతెన మరమ్మతులకు గురవడంతో కొత్త వంతెన నిర్మాణం కోసం ప్రజలు గత పదేళ్లుగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. వంతెన నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవ చూపి రూ.2.40 కోట్లు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. నెలల వ్యవధిలోనే నిర్మాణాన్ని పూర్తి చేసి, ప్రజల కష్టాలను తొలగించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు మాట్లాడుగూ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖామాత్యులుగా బూడి ముత్యాలనాయుడు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, నియోజకవర్గానికి వచ్చిన వెంటనే పంచాయతీరాజ్ ఈఎన్‌సీకి వంతెన పరిస్థితిని చూపించారని వెల్లడించారు. వెంటనే వంతెన నిర్మాణానికి అవసరమైన నిధుల్ని మంజూరు చేసినందుకు రెండు గ్రామాల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ డీఈ వెంకటరావు, ఏఈ పి.రామ్మూర్తి పేర్కొన్నారు.

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాట్ల తాతరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, వారాధి అప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆకుల సాయి ప్రసాద్, గోవాడ సుగర్స్ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు వంటాకు గోవిందరావు, వంటాకు రామునాయుడు, మాజీ ఉప సర్పంచ్ బొడ్డు లక్ష్మి దేముడు బాబు, జాగరపు కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చింతపాక మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రం

బుచ్చెయ్యపేట : వేసవి కాలంలో పాదచారులు, ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉపశమనం పొందేలా చలివేంద్రాల ఏర్పాటుకు యువత ముందుకు రావాలని చింతపాక సర్పంచ్ గొలజాన శ్రీను పిలుపునిచ్చారు. శనివారం ఆయన చింతపాక మెయిన్ రోడ్డులో ఆంజనేయస్వామి ఆలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. తీవ్ర ఎండల దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, ఒకవేళ వెళ్లాల్సి వచ్చినా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీఆర్పీ నాయుడు, పంచాయతీ సెక్రటరీ కృష్ణవేణి గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్లు

మాకవరపాలెం : అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని రామన్నపాలెం గ్రామ సమీపం నుంచి శనివారం ఉదయం మట్టిని తరిలిస్తున్నట్టు అందిన సమాచారంతో, దాడి చేసి నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. వీటిని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్టు వెల్లడించారు.

గాలివాన బీభత్సం

- విరిగిన చెట్లు, తెగిపడ్డ విద్యుత్ వైర్లు
- మామిడి, జీడి పంటలకు నష్టం



పి.పొన్నవోలు వద్ద తెగిపడిన ఎల్‌టీ లైన్ వైర్లు



బత్తివానిపాలెం : పిడుగుపాటుకు మృతి చెందిన ఆవు



నాగయ్యపేట : పిడుగుపడి మరణించిన చూడి ఆవు

రావికమతం/మాడుగుల/దేవరాపల్లి/కె.కోటపాడు : గత రెండు వారాలుగా భానుడి ప్రతాపంతో వగటిపూట రోడ్డుపైకి రావడానికి భయపడ్డ జనం, శనివారం మధ్యాహ్నం నుంచి కాస్త ఉపశమనం పొందారు. అప్పటి వరకు ఎండ, ఉక్కబోతతో ఉన్న వాతావరణం మధ్యాహ్నం తర్వాత ఆకాశం మబ్బులు పట్టి చల్లగాలులతో సేదతీర్చింది. సాయంత్రం పలు చోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో గాలివాన దంచికొట్టింది. దీంతో కొన్ని చోట్ల చెట్లు రోడ్డుకు అడ్డంగా నేలకూలాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. పిడుగులు పడి పశువులు చనిపోయాయి. మామిడి, జీడి పంట నేల రాలి నష్టం వాటిల్లింది.

- రావికమతంలోని పలు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. పి.పొన్నవోలు వద్ద హెచ్‌టీ వైర్లు తెగిపడ్డాయి. దొండపూడి ఫారెస్ట్ తాణా స్తంభాలు నేలకొరిగాయి. చీమలపాడు వద్ద భారీ చెట్టు రోడ్డుకు అడ్డంపడింది.
- మాడుగుల హైస్కూల్ కాలనీకి చెందిన ఎడ్ల కొండమ్మకు చెందిన చూడి గేదె పొలంలో మేత మేస్తుండగా పిడుగుపడి మరణించింది. రూ.80 వేలు విలువ చేసే గేదె మృతితో జీవనాధారం పోయిందని కొండమ్మ బోరున విలపించింది. 14వ వార్డు సభ్యులు గొరీపట్టపు అచ్చుతం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని ఓదార్చింది.
- దేవరాపల్లి మండలం నాగయ్యపేట గ్రామంలో పిడుగుపాటుకు గురై బత్తి బుచ్చిబాబుకు చెందిన చూడి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. రూ.50 వేల విలువైన ఆవు తన కళ్ల ముందే మరణించడంతో బుచ్చిబాబు షాక్ గురయ్యాడు. తృటిలో ప్రాణాపాయం తప్పిందని సంతోషించాలో.. జీవనాధారం పోగొట్టుకున్నందుకు బాధపడాలో తెలియట్లేదని బుచ్చిబాబు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ శాఖ అధికారులకు గ్రామస్తులు నివేదించారు.
- కె.కోటపాడు మండలం బత్తివానిపాలెంలో రావాడ రాముకు చెందిన ఆవు కూడా పిడుగు పడి మృతి చెందింది. సాయంత్రం కళ్లం వద్ద కట్టిన ఆవు పిడుగుపాటుతో మరణించడంతో రైతు రాము బోరును విలపించాడు. ఆవు విలువ రూ.50 వేల వరకు ఉంటుందని స్థానికులు చెప్తున్నారు.

26న నేత్ర వైద్య శిబిరం

కశింకోట : స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 26న వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్న ట్టు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే ఈ వైద్య శిబిరాన్ని రాష్ట్ర పరిశ్రమ లు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. శిబిరంలో అన్ని రకాల కంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, నిరుపేదలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని కంటి సంబంధిత రోగాలతో బాధపడేవారు వినియోగించుకోవాలని కోరారు.

జోరు వానతో కాస్త ఉపశమనం



బుచ్చెయ్యపేటలో మబ్బులు పట్టిన ఆకాశం

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేటలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపాడు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఒక్కసారిగా ఆకాశం మబ్బులుపట్టి, వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన మొదలయింది. దీంతో ఉక్కబోత వాతావరణం నుంచి కాస్త ఉపశమనం దక్కినట్టయింది. వారం రోజులుగా తీవ్ర ఎండలు, వడగాల్పులు, ఉక్కబోతతో అవస్థలు పడుతున్న ప్రజలు మారిన వాతావరణంతో హాయిని అనుభవించారు.

గురుకుల ప్రవేశ పరీక్ష నేడు

దేవరాపల్లి : ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రనాథ్ తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అర్హత సాధించిన విద్యార్థులకు విశాఖ, అనకాపల్లి జిల్లాలోని గురుకులాల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. నిర్ణీత సమయానికంటే గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. స్థానిక గురుకులంలో 5వ తరగతికి 474 మంది, ఇంటర్ ప్రవేశ పరీక్షకు 81 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

- గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ
- అడుగడుగునా వెల్లువెత్తిన ప్రజాభిమానం



గాంధీగ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం : ప్రజల కష్టాలు తెలుసుకుని, వారి సమస్యలను పరిష్కరించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. సర్పంచ్ గాడి అప్పారావు అధ్యక్షతన గాంధీగ్రామంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అడుగడుగునా ప్రజలు నీరాజనం పట్టారు. హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతూ తమకు జగన్ ప్రభుత్వం ద్వారా అందిన సాయాన్ని చెప్పి, ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. వలంటీర్ల పనితీరు ఎలా ఉంది? జగనన్న సాయం మీకు అందుతోందా? అంటూ ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వివరించారు. ప్రజా అవసరాలు తీర్చడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో చైతన్య, హౌసింగ్ ఏఈ రమణమూర్తి, పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, టెలిఫోన్ అడ్వయిజరీ బోర్డు సభ్యుడు వేచలపు ప్రకాష్, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రక్షణ గోడలు ఏర్పాటు చేయరూ..



రక్షణ గోడలు లేని కందిగెడ్డ వంతెన

కె.కోటపాడు : మండలంలోని గవరపాలెం-కె.జె.పురం గ్రామాల మధ్య కందిగెడ్డపై ఉన్న వంతెన రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ వంతెన నిర్మాణం జరిగి సుమారు 25 ఏళ్లు గడుస్తున్నా నేటికీ వంతెనకు రక్షణ గోడలు నిర్మించలేదు. ఈ వంతెన మీదుగానే కె.కోటపాడు మండల గ్రామాల ప్రజలు విజయనగరం, కొత్తవలస ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన ప్రాంతం మలుపు వద్ద ఉండడంతో దగ్గరకు వచ్చేంత వరకు ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించే పరిస్థితి లేక, ప్రమాదాల బారిన పడుతున్నారు. వంతెనకు రెండు వైపులా రక్షణ గోడలను నిర్మించాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు



జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

మాకవరపాలెం: జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అన్నారు. మండలంలోని పైడిపాలలో రూ.20 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టనున్న తాగునీటి కుళాయి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసేందుకు రూ.12 కోట్లు మంజూరైందన్నారు. ఈ నిధులతో పనులు జరుగుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రుత్తల లక్ష్మి, పార్టీ నేత శ్రీను పాల్గొన్నారు.

నాలుగు పశువుల పాకలు దగ్ధం



ప్రమాదంలో దగ్ధమైన పశువుల పాకలు

మాకవరపాలెం : అగ్ని ప్రమాదంలో నాలుగు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. మండలంలోని లచ్చన్నపాలెం గ్రామ శివారులో గుడివాడ దేముడు, కిల్లాడ అచ్చమ్మ, కన్నూరు రాములమ్మ, నూకరాజులకు చెందిన పశువుల పాకలు శనివారం ఉదయం దగ్ధమయ్యాయి. రైతులు తెల్లవారుజామునే పశువులను బయటకు తీసుకురావడంతో వాటి ప్రాణాలకు నష్టం కలగలేదు. లేకుంటే రూ.లక్షల్లో ఆస్తినష్టం వాటిల్లేదని రైతులు తెలిపారు. ఈ ప్రమాదంలో కోళ్లు, పశుదాణా పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

జగనన్నే మా భరోసా

- ప్రతి ఇంటా సీఎం జగన్‌పై అభిమానం
- ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



చమ్మచింతలో సంక్షేమ పథకాలపై వివరిస్తున్న వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి



మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్



వి.వి.అగ్రహారంలో బ్రోచర్లు అందిస్తున్న నేతలు

మాకవరపాలెం : టీడీపీ నేతలు చెప్పే మాయమాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్ అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మండలంలోని జి.వెంకటాపురంలో శనివారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయలేని టీడీపీ నేతలు ఇంకా ప్రజలను మభ్యపెట్టే మాటలు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ మాట్లాడుతూ శుక్రవారం టీడీపీ నేతలు ఈ గ్రామంలో చేసిన ఆరోపణలను ఖండించారు. వాస్తవాలను, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. గత ప్రభుత్వంలో ఆ పార్టీ వాళ్లకే పథకాలు అందేవని, ప్రస్తుత ప్రభుత్వంలో అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ చిటికెల రమణ, సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ బొడ్డు గోవిందరావు, పార్టీ నాయకులు గొంతిన హరి బాబు, పెట్ల భద్రాచలం, స్థానిక నేతలు గాంధీ, గంగరాజు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : వి.వి.అగ్రహారంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఉప సర్పంచ్ సయ్యపురెడ్డి గునమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్, వెలగాడ ఈశ్వరావు, సయ్యపురెడ్డి హరికృష్ణ, దాడి రాజేశ్వరావు, మాజీ సర్పంచ్ సయ్యపురెడ్డి నారాయణరావుతో పాటు గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నాతవరం : మండలంలోని చమ్మచింత గ్రామంలో శనివారం వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిపై ప్రజలకు వివరించారు. మా నమ్మకం నువ్వే జగన్ పేరిట రూపొందించిన స్టిక్కర్లను లబ్ధిదారుల ఇళ్లకు అతికించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పెట్ల ఉమా శంకర్ గణేష్, సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి మద్దతు తెలిపాల్సిందిగా అభ్యర్థించారు.